TGTEL 26/A4521

# నేటి తరం

తెలుగు దినపత్రిక

అన్నీ వాస్తవాలే

శనివారం జూన్ 13, 2026 | సంపుటి :03 సంచిక : 323

Hyderabad,,karimnagar,khammam,Nalgonda,Nizamabad, Warangal,Mahabubnagar,Rangareddy,Medak,Adilabad

సంపాదకులు : బొమ్మ అమరేందర్

పేజీలు : 08 వెల –6–


Follow :

www.netitharam.com




# సారు రమ్మంటే రాడు..

# ఎన్నికలొస్తే వద్దన్నా వస్తాడు!!




## సారే కావాలని కార్యకర్తలు అనుకుంటే సరిపోదు.

## పాటలు రాయించుకొని పాడుకుంటే కుదిరేది కాదు.




**ఎలివేషన్లు** ఎంత గొప్పగా వుంటాయో..సినిమా అంత అట్టర్ ఫ్లాప్ అవుతుందని సినీ పండితులు చెబుతుంటటారు. అలాగే రాజకీయాల్లో కూడా ఎలివేషన్ ఎక్కువగా వుండే నాయకుడి పరిస్థితి అలాగే వుంటుందని కేసిఆర్ నిరూపిస్తున్నారు. అయినా కేసిఆర్ సహజ శైలి ఈ తరం నాయకులకు తెలియదు. ఆ తరం నాయకులకు తెలిసినా చెప్పరు. కేసిఆర్ పామ్ హౌజ్ దాటి జనంలో ఎప్పుడూ వుండరు. ఆయనకు కావాలనుకున్నప్పుడు వస్తారు. ఆయన వద్దనున్నంత కాలం ఫామ్ హౌజ్‌లోనే వుంటారు. ఉద్యమ కాలంలోనే ఆరునెలల కోసారి బైటకు వచ్చేవారు. ప్రజా సంఘాలు, విద్యార్థులు ఉద్యమం చేస్తుంటే ఫామ్ హౌజ్‌నుంచి చూస్తూ వుండేవారు. అప్పుడప్పుడూ వారిని ఫామ్ హౌజ్‌కు పిలిపించుకొని ఓ పూట భోజనం పెట్టి వారిని మెచ్చుకునేవారు. తెలంగాణ అంటే తనదైన శైలిలో వారికి చెప్పి, కేసిఆర్ గొప్ప మేధావి అనిపించుకునేవారు. తెలంగాణ మీద కేసిఆర్‌కు వున్నంత శ్రద్ధ ఎవరికీ లేదని కేర్తించేలా మెస్మరైజ్ చేసేవారు. అది ఆనాడు ఆ తరం

- సారు రావాలని జనం ఎప్పుడూ కోరుకోరు.
- జనం కోసమే సారు అని పాటలు పాడితే వచ్చేదేమీ లేదు.
- నాయకుడు జనంకోసం రాజకీయాలు చేయాలి.
- జనమే రా..రమ్మని పిలిచే నాయకులు ఎక్కడా వుండరు.
- తన కోసం నాయకుడైన వాళ్లే రాజకీయ నాయకులు.
- జనం కోసం నాయకుడయ్యాడని అని చెబితే శుద్ధ అబద్ధం.
- తెలంగాణ తెచ్చిన వీరుడు అని కీర్తించుకుంటే సరిపోదు.
- జనం కీర్తలను లేనప్పుడు కర్యకర్తలు చేసే భజనలకు విలువుండదు.
- రెండు సార్లు కేసిఆర్‌కు జనం అవకాశమిచ్చారు.
- మూడోసారి నిలబెట్టుకోవాలనే తీరులో పాలన సాగించలేదు.
- దేశంలో నాలుగు,ఐదు సార్లు గెలిచి పాలన చేసిన నాయకులు ఎంతో మంది వున్నారు.
- గెలిపిస్తే ప్రగతి భవన్‌లో కూర్చొని, బైటకు రాని కేసిఆర్ ఇప్పుడు వచ్చి ఏం చేస్తారు.
- అదికారంలో వున్నప్పుడే జనం ముఖం చూసింది లేదు.
- ఇప్పుడు జనంలోకి వచ్చినా పెద్దగా ఒరిగేదేమీ వుండదు.
- ఓట్లు అడుక్కోవడానికి తప్ప సారు బైటకు వచ్చినా ఆకాశం విరిగిపడేదేమీ వుండదు.
- గెలిచిన పదేళ్లు ఫామ్‌హౌజ్‌నుంచే పాలించారు..లేకుంటే ప్రగతి భవన్‌లో వుంటారు.
- ప్రతిపక్ష నాయకుడిగా వున్న సొంత నియోజకవర్గ ప్రజలను కలిసింది లేదు.
- సారే ..సారే..రావాలని ఎవరు కోరుకుంటున్నారు? ఎవరు పాట పాడుకుంటున్నారు??

గుర్తించలేదు. ఇప్పటి తరానికి కేసిఆర్ అడుగులు అక్కర్లేదు. కేసిఆర్ పేరును పదే జనమే గుర్తు చేసుకుంటున్నట్లు నాయకులు చెప్పుకుంటుంటారు. ఉద్యమ కాలంలో ఫామ్ హౌజ్‌లో కూర్చొని ఉద్యమ వ్యూహాలు రచిస్తున్నారని గొప్పలు చెప్పించుకునేవారు. ప్రజలు అదికారమిచ్చాక కూడ ఫామ్ హౌజ్‌లో అభివృద్ధి ప్రణాళికలు రచిస్తున్నారని చెప్పుకునేవారు. మొత్తం మీద సారు మాత్రం ఫామ్ హౌజ్ దాటి బైటకు రారు..అనేది అందరికీ తెలిసిన సత్యమే. ఇప్పుడు పులి పామ్ హౌజ్‌లో మళ్లీ ఎలా అదికారంలోకి రావాలని వ్యూహాలకు పదును పెడుతున్నాడని చెబుతుంటారు. పనిలో పనిగా ప్రజలు సారే కావాలంటున్నది తెలంగాణ పల్లెలల్ల, సారే రావాంటున్నది అని పాటలు పాడించుకొని, జనానికి వినిస్తున్నారు. ఉద్యమ సమయంలోకూడా ఎన్నికలు ఎప్పుడు వుంటే అప్పుడు మాత్రమే కేసిఆర్ వస్తూ వుంటారు. అలా ఉప ఎన్నికలు తేవడం, ఎన్నికల పేరుతో ప్రజల్లో వుండడం మాత్రమే జరుగుతుండేంది. కాని ఆయన పూర్తి స్థాయిలో ప్రజల్లో వున్నది ఏనాడు లేదు. మిలియన్ మార్చ్ లాంటి కార్యక్రమంలో ఆఖరు దశలో చేరుకున్నారు. సాగర హారం లాంటి కార్యక్రమంలో ఎక్కడా కనిపించింది లేదు. ఎందుకంటే తెలంగాణ ఉద్యమంలో గొప్పగా చెప్పుకునే రెండు అతి ముఖ్యమైన కార్యక్రమాల్లో మిలియన్ మార్చ్, సాగరహారం. మిలియన్ మార్చ్‌లో ట్యాంక్ బండ్ మీదున్న విగ్రహాలను తొలగించే ప్రక్రియ జరిగింది. ఆ సమయంలో లేకుంటే ఉద్యమంలో ఎక్కడ వెనుకబడిపోతానో అనుకున్నారో ఏమో కాని, ఆఖరు దశలో వచ్చారు. సాగరహారం కార్యక్రమాన్ని మొత్తం ఆనాడు ఈటెల రాజేందర్‌కు వదిలిపెట్టారు. ఇక తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న తర్వాత తాను బైటకు రావాల్సిన అనివార్యత ఏర్పడింది. దాంతో తనదైన రాజకీయం మొదలు పెట్టారు. తాను రాలేక జాయింట్ యాక్షన్ కమిటి ఏర్పాటు చేశారు. ఏ రాజకీయ పార్టీ నాయకుడిని పెట్టినా ఇబ్బందిగా వుంటుంది. వారి వారి పార్టీలకు ప్రయోజనం చేకూరేలా వుంటుందని గ్రహించి, కోదండరామ్‌ను చైర్మన్ చేసి చేతులు దులుపుకున్నారు. ఉద్యమమంతా జేఏసి చేతిలో పెట్టేశారు. జేఏసి క్షేత్ర స్థాయిలో ఉద్యమం ఉధృతంగా సాగిస్తే, దానిని డిల్లీలో చూపించి తన వల్లే ఉద్యమం సాగుతుందని చెప్పుకుంటూ వెళ్లారు. ఉద్యమ సారధ్యమంతా తనదే అనిపించుకున్నారు. అప్పటి నుంచి కేసిఆర్ క్షేత్ర స్దాయికి వచ్చింది లేదు. కాకపోతే ఐదేళ్ల కాలం పాటు హరీష్‌రావు, కవితలు, కేటిఆర్‌లు ఎంతో కొంత ముందుండి ఉద్యమం సాగించారు. కేసిఆర్ మాత్రం డిల్లీలో వుంటూ వచ్చేవారు. కాంగ్రెస్ నాయకులతో చర్చలు జరుపుతున్నట్లు ప్రకటనలు చేయడం చేస్తూ వుండేవారు. కాకపోతే ఎప్పటికప్పుడు ఇదితో తెలంగాణ, ఇదిగో తెలంగాణ అంటూ ఆంద్రా నాయకుల కంటి మీద కునుకు లేకుండా చేసేవారు. అలా అన్ని వర్గాల ప్రజలు, పార్టీలు, నాయకుల చేత జై తెలంగాణ అనిపించారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన దీక్ష మీద కూడా రకరకాల విమర్శలున్నాయి. కాని తెలంగాణ కోసం ఆ మాత్రం చేసిన నాయకుడు మాత్రం ఎవరూ లేరు. ఆ విషయంలో కేసిఆర్‌ను కాదని అనే వారు ఎవరూ వుండరు. కాని ప్రజల్లో మాత్రం కేసిఆర్ వుండలేదు. జనం ముందుకు పదే పదే రాలేదు. జనంలోనే ఎప్పుడూ వుండాలంటే వుండలేదు. ఆయన ఒంటరి జీవి...జనం రావాలని కోరినా రారు. ఆయన రావాలనుకున్నప్పుడే వస్తారు. ఎన్నికల్లో గెలిపిస్తేనే వస్తామంటారు. తన కోసమే రాజకీయాలు చేస్తారు. జనం కోసమని నమ్మిస్తారు. అంతే...

## ఉష్ణోగ్రతలు

| | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| Hyderabad | ~32 °C | ~37°C |
| Warangal | ~30 °C | ~38 °C |
| Karimnagar | ~31 °C | ~36 °C |
| Rangareddy | ~31 °C | ~36 °C |
| Khammam | ~31 °C | ~38 °C |
| Mahabubnagar | ~32 °C | ~37 °C |
| Nalgonda | ~30 °C | ~36 °C |
| Nizamabad | ~31 °C | ~36 °C |

## కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ నెక్ / రిటైల్-

**Hyderabad**

Per piece: ₹ 5.55
Per 100 pieces: ₹ 550-620
Per dozen: ₹ 66

**warangal**

Per piece: ₹ 5.55
Per 100 pieces: ₹ 550-620
Per dozen: ₹ 64.44

# వచ్చే ఏడాది మార్చి వరకు బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి

అమీర్‌పేట: బీబీనగర్‌లో నిర్మిస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిని వచ్చే ఏడాది ఫిబ్రవరి- మార్చి నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రిని కూడా మరో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. అమీర్‌పేట, సనత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను శుక్రవారం కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీర్‌పేట యూపీహెచ్‌సీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు ముఖ్యంగా తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ పేద కుటుంబానికి రూ.5 లక్షల మేరకు ఉచిత వైద్యం



అందించేలా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు.సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ, బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈఎస్ఐసీలో నిర్మించిన కొత్త ఓపీ బ్లాక్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. రూ.వెయ్యి కోట్లతో అదనపు భవనాలు, హాస్టల్ వసతులు, మరిన్ని పడకలు ఏర్పాటు చేసి ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సామర్థ్యాన్ని మరింత పెంచుతామన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని యూపీహెచ్‌సీల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నామని, అవసరమైన వైద్య పరికరాలను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీనియర్ ప్రజారోగ్య అధికారిణి డా.హేమలత, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ఎ.సుజాత, దిశా కమిటీ సభ్యులు బూర్గుల శ్యామ్‌సుందర్, భాజపా జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెల్లాల రాంమోహన్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

## ♦ అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ



**హైదరాబాద్,జూన్12 :**
స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.



## పాశ్చాత్య దేశాల
# ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కోనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

**న్యూఢిల్లీ,జూన్12 :**
పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతాద్ది 3 లో

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

## ♦ పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి ♦ అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

**హైదరాబాద్,జూన్12**
సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ



చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ఖమ్మం,జూన్12 :**
ఎస్ఐఆర్ సర్ అనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు.

03

# సంక్షేమ శాఖలో
# అవినీతి అంతా అబద్ధం

» నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు

» హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన



3 లో

**సిద్ధిపేట,జూన్12 :**
సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు.

## మీనాక్షి వ్యవహారంపై
# సిట్ వేయగలరా?

» ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి

» రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ

» మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



3లో..

**హైదరాబాద్,జూన్12:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు.మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి.




మిగతాది 3లో

# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

## ♦ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూన్12 :**
తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి



- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం

**కరీంనగర్,జూన్12 :**
రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు.

మిగతాద్ది 3 లో

# బంజారాహిల్స్ నీలోఫర్ కేఫ్ ఎన్వోసీ రద్దు

**హైదరాబాద్:**
నగరంలోని బంజారాహిల్స్‌లో ఉన్న నీలోఫర్ కేఫ్ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ)ను అగ్నిమాపక శాఖ రద్దు చేసింది. ఇందులో ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. నాలుగో అంతస్తులో అనుమతి లేకుండా రెస్టరంట్ నిర్వహిస్తున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఫైర్‌సేఫ్టీ నిబంధనలను పాటించాలని యజమానికి డీజీ విక్రమ్‌సింగ్ హెచ్చరించారు.

TELANGANA STATE FIRE
DISASTER RESPONSE & FIRE SERVICES
WE SERVE TO SAVE

## సంక్షేమ శాఖలో
# అవినీతి అంతా అబద్ధం

రెండోవపేజీ తరువాయి

అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

రెండోవపేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

# సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

రెండోవపేజీ తరువాయి

గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## ఏడాదిగా జీవచ్ఛవంలా బతుకతున్నాను
## ఎయిరిండియా ప్రమాదంలో బయటపడ్డ విశ్వాస్

దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఎయిరిండియా ప్రమాద ఘటన జరిగిన నేటికి ఏడాది అయ్యింది. ఆ దుర్ఘటన నుంచి బయటపడిన ఒక్కే ఒక్కడు విశ్వాస్ కుమార్ రమేశ్ . ఏడాది గడిచిపోయినా.. ఆయన ఈ విషాదాన్ని మర్చిపోలేకపోతున్నారు. అలాగే బాధిత కుటుంబాల మనసుల్లోని ప్రశ్నలకు సమాధానాలు కావాలని అడుగుతున్నారు. నేను బతికి బయటపడినదే ప్రజలకు కనిపిస్తుంది. కానీ నాలుగు గోడల మధ్య నేను ఎదుర్కొంటున్న సవాళ్లు ఎవరికీ అర్థం కావు. ఇప్పటికీ నేను నిద్రలేమి, ఆందోళన, చేదు జ్ఞాపకాలతో పోరాడుతున్నాను. ఒక సంవత్సరం గడిచిపోయింది. బతికి ఉన్నందుకు కృతజ్ఞుడినే. కానీ అప్పటినుంచి నేను చేస్తోన్న పోరాటాన్ని మాత్రం మాటల్లో వర్ణించలేను. నా జీవితాన్ని పునర్నిర్మించుకుంటూ కుటుంబంతో కలిసి ముందుకు సాగుతున్నాను అని జాతీయమీడియాతో మాట్లాడారు. ఈ బాధ తన ఒక్కడిదే కాదని, ప్రభావిత కుటుంబాలు కూడా ఇదేరకమైన వేదనను అనుభవిస్తున్నాయని విశ్వాస్ చెప్పారు. జరిగిన దానిని ఎవరూ మార్చలేరు కానీ.. ప్రజలకు నిజాయతీ, వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు కావాలన్నారు. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ ఒక్కడే బయటపడ్డారు. బ్రిటన్‌లో నివాసముంటున్న విశ్వాస్.. గుజరాత్‌లోని తన కుటుంబాన్ని కలిసేందుకు వచ్చి తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

రెండోవపేజీ తరువాయి

రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

రెండోవపేజీ తరువాయి

కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

## అహ్మదాబాద్ ఎయిరిండియా ఘటనకు ఏడాది
# దుర్ఘటనపై దర్యాప్తు పురోగతిలో ఉంది

**ప్రమాదంపై ఇంకా దుష్ప్రచారాలు చేయడం తగదు**
**కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**

అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి స్పందించారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు పక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇదిలావుంటే ఆ విమానం కూలిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. 15 బాధిత కుటుంబాలు తమ ఆత్మీయుల వ్యక్తిగత వస్తువులను స్వీకరించడానికి నిరాకరించా యని ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ శుక్రవారం వెల్లడించింది. 91 శాతం కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహార చెల్లింపును పూర్తిచేశామని తెలిపింది. పత్రాలు సరిగా లేని, పరిహార స్వీకరణకు నిరాకరించిన కేసుల్లో పరిహార చెల్లింపు పక్రియ పూర్తికాలేదని చెప్పారు. 96 శాతం బాధిత కుటుంబాలకు మధ్యంతర పరిహారం కింద రూ.25 లక్షలు అందించామని పేర్కొంది.

# రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు
## రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది

**రాయలసీమను రాయల్ సీమగా మార్చాం**
**మనది గూగుల్ అయితే..వారిది గొడ్డలి**
**తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు**

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్య్రం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కు ఘన సన్మానం



**గజ్వేల్ జున్ 12,( నేటి తరం)**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమత సంతోష్ కు శుక్రవారం హైదరాబాద్ చంపాపేట్ లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్ మాట్లాడుతూ, ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో, ఇటీవల ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య ప్రజా ప్రతినిధులను సన్మానించి జ్ఞాపకతో సత్కరించడం జరిగిందని అందులో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రెండవ వార్డ్ కౌన్సిలర్ గోలి మమతా సంతోష్ కు తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్ చేతుల మీదుగా సన్మానం చేసి జ్ఞాపిక అందజేయడం జరిగిందని, గోలి మమత సంతోష్ రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు,

# ప్రజా సంక్షేమమే ధ్యేయం.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్







- నివాస కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, సంఘాల ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ
- వివిధ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆహ్వాన పత్రాల అందజేత
- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ
- కుత్బుల్లాపూర్ అభివృద్ధికి వివేకానంద్ కృషి ప్రశంసనీయమని నాయకుల అభినందనలు

**కుత్బుల్లాపూర్, జూన్ 12 ( నేటితరం):**
ప్రజా సంక్షేమమే పరమావధిగా భావిస్తూ నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను శుక్రవారం ఆయన నివాస కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివిధ సామాజిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేయడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన వినతి పత్రాలను సమర్పించారు. ప్రజల సమస్యలు, అవసరాలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఓర్పుగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.
ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సంక్షేమం కోసం పనిచేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సేవలను అభినందించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ప్రజలతో సన్నిహితంగా మెలుగుతూ అందుబాటులో ఉండే నాయకుడిగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని వారు పేర్కొన్నారు.

## ఆటోలో ప్రయాణించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

- రేకొండ నుంచి చిగురుమామిడి వరకు ఆటో ప్రయాణం
- సామాన్యుడిలా ప్రజల మధ్యలో కేంద్ర మంత్రి బండి



**చిగురుమామిడి, జూన్ 12, ( నేటి తరం ):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సామాన్యుడిలా ఆటోలో ప్రయాణించి అందరి దృష్టిని ఆకర్షించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన ఆటోలోనే ప్రయాణిస్తూ ఆటో డ్రైవర్ దిలీప్ తో ముచ్చటిస్తూ మోడీ పాలనపై ఆయన అభిప్రాయాలను తెలుసుకున్నారు. చిగురుమామిడికి వెళ్లారు.
రేకొండ గ్రామం నుంచి చిగురుమామిడి వరకు సాధారణ ప్రయాణికుడిలా ఆటోలో ప్రయాణించిన కేంద్ర మంత్రిని చూసి స్థానికులు ఆసక్తిగా గమనించారు. రోడ్డు వెంట పలువురు ప్రజలు ఆయనకు అభివాదం చేస్తూ స్వాగతం పలికారు.ప్రజలకు మరింత చేరువగా ఉండే ప్రయత్నంలో భాగంగానే బండి సంజయ్ ఈ విధంగా ఆటో ప్రయాణం చేసినట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఆయన నిరాడంబరతపై పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు.

## "స్వచ్ పాఠశాల-టిఫిన్ బైఠక్"కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- సద్ది తెచ్చుకొని స్థానికులతో కలిసి భోజనం చేసిన బండి



**చిగురుమామిడి, జూన్ 12, ( నేటి తరం ) :**
ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలో "స్వచ్ పాఠశాల-టిఫిన్ బైఠక్"(సద్ది భోజనం) కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు,పార్టీ కార్యకర్తలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు, అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు.విద్యతో పాటు పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. రాజకీయాలకు అతీతంగా పాఠశాలను శుభ్రం చేసుకోవాలని ఆయన కోరారు. పాఠశాలలోని సమస్యలు అడిగి తెలుసుకొనగ విద్యార్థులకు భోజన వసతి లేదని, ప్రాథమిక పాఠశాలకు తరగతి గదుల సమస్య ఉందని ఉపాధ్యాయులు తెలుపగా దీనిపై సానుకూలంగా స్పందించిన బండి సంజయ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భోజన సౌకర్యం కోసం 5 లక్షల సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రాథమిక పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి 20 లక్షలు సహాయం చేస్తానని ప్రకటించారు.మొదటి విడతగా 10 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు.పదవ తరగతిలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులను కేంద్ర మంత్రి అభినందించారు. ఈసారి కూడా పదవ తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా మోడీ 12 ఏళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానికులను బండి సంజయ్ కోరారు.మోడీ పాలన విజయాలకు సంబంధించిన బుక్ లెట్లను ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ లో చేరిన ఏటి గడ్డ కిష్టాపూర్ గ్రామ బీజేపీ నాయకులు



**గజ్వేల్ జున్ 12, (నేటి తరం)**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో జనసేనలోకి బీజేపీ నాయకుల చేరికలు దామరంచ కర్ణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కండువాలు కప్పి ఆహ్వానించిన జనసేన నాయకుడు కమ్మరి శ్రీను గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఏటి గడ్డ కిష్టాపూర్ గ్రామంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు ఈ సందర్భంగా కమ్మరి శ్రీను మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక రాజకీయాలే జనసేన పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువత పెద్ద ఎత్తున జనసేన వైపు అడుగులు వేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కూడా జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు దామరంచ కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో జనసేన పార్టీలో చేరినట్లు తెలిపారు. జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొని కొత్తగా చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు ఈ చేరికలతో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో జనసేన పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు

## నిజాంపేట్‌లో డంపింగ్ యార్డ్ చెల్లింపులపై అక్రమాల ఆరోపణలు

- సిఎంసి కమిషనర్‌కు సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ ఫిర్యాదు
- రూ. 3.40 కోట్ల చెల్లింపులపై సమగ్ర విచారణకు విజ్ఞప్తి
- టెండర్లు, బిల్లులు, జీఎస్టీ నమోదుల పరిశీలన కోరిన ఫిర్యాదుదారు
- పలువురు ప్రస్తుత, మాజీ అధికారుల పాత్రపై విచారణ డిమాండ్
- ప్రజాధనం దుర్వినియోగం తేలితే రికవరీతో పాటు చర్యలు తీసుకోవాలని వినతి



**నిజాంపేట్, జూన్ 12: ( నేటి తరం)**
నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో డంపింగ్ యార్డ్ నుంచి జవహర్‌నగర్‌కు చెత్త రవాణా కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులు, రికార్డుల నిర్వహణలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెలువడిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ సిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, 2023 నుంచి 2025 మధ్యకాలంలో డంపింగ్ యార్డ్ చెత్త రవాణా కాంట్రాక్టులకు సంబంధించి సుమారు రూ.3.40 కోట్ల మేర చెల్లింపుల్లో అవకతవకలు జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. అసలు కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన నిధులు ఇతర సంస్థల పేర్లతో మళ్లించబడ్డాయనే ఆరోపణలపై లోతైన విచారణ నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఫిర్యాదులో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధీరజ్ కుమార్, మాజీ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సబీర్ అలీతో పాటు సంబంధిత అధికారుల పాత్రను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ రవాణా కాంట్రాక్టులు, టెండర్ ప్రక్రియ, బిల్లుల చెల్లింపులు, మెజర్‌మెంట్ బుక్స్, జీఎస్టీ నమోదులు, బ్యాంకు ఖాతాల లావాదేవీలు సహా అన్ని సంబంధిత పత్రాలు, రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. అలాగే, జేఎంసీ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కాకుండా జే ఎం సీ కన్స్ట్రక్షన్ పేరుతో రికార్డులు నిర్వహించినట్లు అనుమానాలు ఉన్నాయని, దీనిపై కూడా ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధులను తిరిగి రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 2020 నుంచి 2025 వరకు జరిగిన సివిల్ వర్క్స్, డంపింగ్ యార్డ్‌కు సంబంధించిన అన్ని చెల్లింపులపై స్వతంత్ర, పారదర్శక విచారణ నిర్వహించి బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు.

## ముడిచమురు సరఫరాలో అంతరాయం

## ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు

**- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం**
పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది.
పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

## చేనేత టెండర్ విధానం పై ప్రభుత్వం 15 లోపు స్పందించకపోతే టెస్కో కార్యాలయాన్ని ముట్టడిస్తాం

- వరంగల్ ధర్నాలో చేనేతల హెచ్చరిక





**వరంగల్ జిల్లా ప్రతినిధి జూన్ 12 నేటితరం**
రాష్ట్ర ప్రభుత్వం చేనేత టెండర్ విధానాన్ని తెచ్చి చేనేత కళాకారుల పొట్టకొట్టింది. గత ప్రభుత్వాలు జీవో నెంబర్ 1 తెచ్చి టెస్కో ద్వారా చేనేత ఉత్పత్తులు ఖరీదు చేసి చేనేత కళాకారులకు పని కల్పిస్తుంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 15 ద్వారా చేనేత టెండర్ విధానాన్ని తీసుకొచ్చి చేనేత కళాకారుల జీవితాలను రోడ్లమీదకు తెచ్చింది. చేనేత టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, తమ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, టెస్కో ద్వారా ప్రొడక్షన్ ప్రోగ్రాం (ప్రా) ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వరంగల్ పట్టణం కొత్తవాడలో గత వారం రోజులుగా చేనేత కళాకారులు ధర్నా నిర్వహిస్తున్నారు. బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ టీ. చిరంజీవులు, చేనేత దినోత్సవ వ్యవస్థాపకులు యర్రమాద వెంకన్న నేత చేనేతల ధర్నాకు మద్దతు తెలుపుతూ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల పట్ల చూపిస్తున్న వివక్షతను గణాంకాలతో సహా వివరించారు. చేనేతల ఓట్లతో గద్దెనెక్కిన స్థానిక శాసనసభ్యులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు చేనేతలకు అండగా నిలబడాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో నెంబర్ 15 రద్దుచేసి గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాన్ని అమలు చేసి 15వ తేదీ లోపు చేనేతల ఉత్పత్తులు ఖరీదు చేయడమే కాకుండా ప్రొడక్షన్ పోగ్రామ్ ఇవ్వాలని, లేనిపక్షంలో హైదరాబాదులో టెస్కో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశారు. హైదరాబాద్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వరంగల్ నుండి వస్తామని చేనేత కళాకారులు మరియు నాయకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. వీరస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ కౌణతం కృష్ణ, డాక్టర్ అవ్వారు వేణు, చెన్న శ్రీకాంత్, జిల్లా ముఖ్య నాయకులు రాజగోవిందు, డాక్టర్ సూర్య కిరణ్, డాక్టర్ ఏం. జనార్ధన్, తుమ్మ తిరుపతి, కందకట్ల సురేష్, వద్నాల నరేందర్,మాజీ ఆప్కో డైరెక్టర్ డి.సూర్యనారాయణ మూర్తి, ప్రొఫెసర్ మురళీమనోహర్, టిపిసిసి చేనేత విభాగం అధ్యక్షులు చిప్ప వెంకటేశ్వర్లు, జాతీయ అవార్డు గ్రహీత పిట్ట రాములు, ఎలుగం వెంకటమల్లు, కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీత బైరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిఎంసి మాజీ ఎంపికి అతివాద సంస్థలతో సంబంధాలు

**- అహ్మద్ హసన్‌పై దర్యాప్తునకు రెబల్ ఎంపి కకోలీ ఘోష్ డిమాండ్**

తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ ఆ పార్టీ మాజీ ఎంపీపై సంచలన ఆరోపణలు చేశారు. తృణమూల్ మాజీ రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన అతివాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్ సంస్థలతో సంబంధాలు ఉండొచ్చని పలు మీడియా నివేదికలు చేసిన బహిరంగ ఆరోపణలను ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు. టీఎంసీ హయాంలో చికెన్ నెక్ కారిడార్ తో సహా కొన్ని సున్నితమైన ప్రాంతాలలో భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళంఅభ్యర్థించిన భూమిని కేటాయించకపోవడం పైనా పలు అనుమానాలు లేవనెత్తారు. వీటిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. రెబల్ ఎమ్మెల్యే రితబ్రత టీఎంసీలో తిరుగుబాటు లేవనెత్తిన అంశంతో తమకేమీ సంబంధం లేదని కకోలీ ఘోష్ పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీలో ఉంటే తాను పార్లమెంట్‌లో ఉన్నానని అన్నారు. రెండు వర్గాలు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను అనుసరిస్తున్నాయన్నారు. ఇటీవల లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. వారు స్పీకర్‌కు రాసిన లేఖ నేడు జాతీయమీడియా చేతికి వచ్చింది. దీంతో రెబల్ ఎంపీలలో కకోలీ ఘోష్, శతాబ్ది రాయ్, భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా మొదలైన కీలక నేతలు ఉన్నట్లు వెల్లడయ్యింది.

# ప్రభుత్వ పాఠశాలలకు వెంటనే యూనిఫాంలు పంపిణీ చేయాలి

- జగద్గిరిగుట్ట జెడ్పీ ఉన్నత పాఠశాల పరిశీలనలో సీపీఐ నేతల డిమాండ్
- పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు దుస్తులు అందించాలని విజ్ఞప్తి
- జీవశాస్త్ర ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఆటంకం
- పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు అవసరం
- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన




**జగద్గిరిగుట్ట, జూన్ 12 ( నేటి తరం):** ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి కేవలం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన యూనిఫాంలు ఇప్పటికీ పంపిణీ కాకపోవడం ఆందోళనకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితిని తెలుసుకునేందుకు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జగద్గిరిగుట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పార్టీ నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను పరిశీలించిన అనంతరం ఉమా మహేష్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే అవసరమైన బోధన సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు లేకపోవడం వల్ల విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదేవిధంగా పాఠశాలలో పారిశుద్ధ్య సమస్యలు ఉన్నట్లు తమ పరిశీలనలో గుర్తించామని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు యూనిఫాంలను తక్షణమే పంపిణీ చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి ఎం. సహదేవరెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, సీపీఐ నాయకులు కృష్ణ, శ్రీనివాస్ చారి, యువజన నాయకులు కార్తీక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ మెరుగ్గా ఉండేది: కేటీఆర్

- కొంపల్లి శ్వేతశుభం రెసిడెన్సీ వాసుల సమస్యలపై స్పందన
- త్రాగునీటి సరఫరా, ట్రాఫిక్ కష్టాలను వివరించిన ఐటీ ఉద్యోగులు
- నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు పునఃప్రారంభించాలన్న విజ్ఞప్తి
- ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో విస్తరణ సాధిస్తామని హామీ





**కొంపల్లి, జూన్ 12 (నేటితరం); :** కొంపల్లి పరిధిలోని శ్వేతశుభం రెసిడెన్సీకి చెందిన ఐటీ ఉద్యోగులు, నివాసితులు శుక్రవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నందినగర్‌లోని ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నివాసితులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో రోజు విడిచి రోజు త్రాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఐదు రోజులకోసారి కూడా తక్కువ ఒత్తిడితో నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల గృహ అవసరాలు తీర్చుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే బోయిన్‌పల్లి--సుచిత్ర--కొంపల్లి--మేడ్చల్ మార్గంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పర్యవేక్షణ లోపంతో గత రెండేళ్లుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ఫలితంగా రోజువారీ ప్రయాణాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మెట్రో రైలు విస్తరణలో భాగంగా కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో సేవలను విస్తరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించడం లేదని నివాసితులు తెలిపారు. ఉత్తర హైదరాబాద్‌లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల కారణంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అసెంబ్లీలోనూ, ఇతర వేదికలపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పటికీ స్పందన కనిపించడం లేదని తెలిపారు. నివాసితుల సమస్యలను విన్న కేటీఆర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలతో హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చి, నగరాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దామని అన్నారు. అయితే ప్రస్తుతం మౌలిక సదుపాయాల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శ్వేతశుభం రెసిడెన్సీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. త్రాగునీటి సరఫరా సమస్య పరిష్కారంతో పాటు నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పునఃప్రారంభం అయ్యేలా కృషి చేస్తామని, ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో విస్తరణ సాధించే దిశగా ఉద్యమిస్తామని తెలిపారు.

# తాండాల ప్రజల ఆరోగ్య సమస్యలపై శంభీపూర్ కృష్ణ ఆందోళన

- అనారోగ్య బాధితులను పరామర్శించిన బీఆర్ఎస్ నేత
- అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా
- వాయు కాలుష్యం, కలుషిత నీటితో ప్రజలు ఇబ్బందులు
- మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి






**దుండిగల్, జూన్ 12 ( నేటితరం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ సర్కిల్ పరిధిలో గాగిల్లాపూర్ తాండా, దుండిగల్ తాండాలకు చెందిన అనారోగ్య బాధితులను బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ శుక్రవారం పరామర్శించారు. మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్‌తో కలిసి బాధితుల నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గాగిల్లాపూర్ తాండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త జగన్ నాయక్ ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా, దుండిగల్ తాండాకు చెందిన కాట్రోత్ లక్ష్మణ్ నాయక్ కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధులతో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన శంభీపూర్ కృష్ణ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే విషయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న లక్ష్మీబాయి, ఫకీరా రాజు నివాసాలకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాండా ప్రజలు తమ సమస్యలను శంభీపూర్ కృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా వాయు కాలుష్యం, కలుషిత తాగునీటి కారణంగా ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాండా ప్రాంతాల్లో స్వచ్ఛమైన మంచినీటి సౌకర్యం కల్పించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు అమర్‌సింగ్ నాయక్, వెంకటేష్ నాయక్, ప్రవీణ్ నాయక్, హనుమంతు, నర్సింగ్ నాయక్, కుమార్ నాయక్, రాజు నాయక్, వాసు నాయక్, పటేల్ రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# 190 జీవో ను వెంటనే అమలు చేయాలి

- జీవో తెచ్చి 9 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయటం లేదు?
- 317 జీవో బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలి
- లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ బ్యూరో జూన్ 12 నేటితరం**

జీవో నంబర్ 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన మధ్యంతర జీవో 190 ని వెంటనే అమలు చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం వీడియో సందేశాన్ని రిలీజ్ చేశారు. వెంటనే 190 జీవో అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

- 190 జీవో ఎందుకు అమలు చేయటం లేదు?

ఎన్నికలకు ముందు 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ...అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేస్తోందని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్నకూడా ఈ ప్రభుత్వానికి గుండె ధైర్యం లేని పరిస్థితి కనిపిస్తుందని చెప్పారు. ఉద్యమకారులు, ఉద్యోగులకు సంబంధించిన అంశాల్లో కమిటీల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. 317 జీవో బాధితులకు న్యాయం చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ విషయంలో ముందడుగు వేయటం లేదో చెప్పాలన్నారు. 317 బాధితులైన టీచర్లు, ఉద్యోగులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పి దామోదర రాజనర్సింహా, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కూడిన కేబినెట్ సబ్ కమిటీ వేశారని...ఆ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఇచ్చిన 190 జీవో ను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. 317 జీవో బాధితులైన టీచర్లకు స్థానికత ఆధారంగా బదిలీలు చేస్తామని చెప్పారని...అవసరమైతే సూపర్ న్యూమరీ ఉద్యోగాలు కూడా సృష్టిస్తామని హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. కానీ 190 జీవో తెచ్చి తొమ్మిది నెలలు గడిచినా దానిని అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరి కోసం, ఏ పైరవీ కోసం ఈ జీవోను అమలు చేయటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. 190 జీవో గడువే మూడేళ్లు ఉందని ఇప్పటికే 9 నెలలు గడిచిపోయిందని ఇంకెప్పుడూ అమలు చేస్తారని ప్రశ్నించారు.

- ఉద్యోగుల కోసం మేము పోరాడుతాం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కారణంగా టీచర్లు, ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కవిత అన్నారు. 317 జీవో కారణంగా వారంత స్థానికత కోల్పోయారని చెప్పారు. జీవో 25 రేషనలైజేషన్ తో సంబంధం లేకుండా వెంటనే 190 జీవోను అమలు చేయాలని కవిత కోరారు. అవసరమైతే టీచర్ల కోసం సూపర్ న్యూమరీ ఉద్యోగాలు క్రియేట్ చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చేస్తోన్న తాత్సారంపై ఉద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని కవిత పిలుపునిచ్చారు. టీచర్లు, ఉద్యోగుల హక్కుల కోసం వారి తరపున తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని కవిత చెప్పారు. వెంటనే 190 జీవో అమలు పై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని కవిత హెచ్చరించారు.

# ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ని విమర్శించే స్థాయి మీకు లేదు -ఇప్ప శ్రీనివాస్ రెడ్డి



**చొప్పదండి ప్రతినిధి జూన్ 12 నేటితరం**

నిన్న జరిగిన భారాస నియోజకవర్గ స్థాయి సమావేశంలో చర్చించాల్సిన అంశాలను పక్కన పెట్టి వ్యక్తిగత విషయాలను ప్రస్తావించడం వారియొక్క మానసిక పరిపక్వత స్థితిని సూచిస్తుందని చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హుజురాబాద్ భారాస ఎమ్మెల్యే ఓటు వేయకుంటే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని నియోజకవర్గ ఓటర్లను బ్లాక్ మెయిల్ చేసి ఓట్లు వేయించుకున్న పాడి కౌశిక్ రెడ్డి లాంటి నాయకుల కింద పని చేసే ఏనుగు రవీందర్ రెడ్డి ఇవాళ మేడిపల్లి సత్యం గారిని విమర్శించడం సిగ్గు చేటని, ఎన్నికల ప్రచారం లో నియోజక వర్గ సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిగా రెండు సార్లు గెలుపు దరి చేరకున్న నిత్యం ప్రజా క్షేత్రంలో ఉన్న నన్ను గెలిపించాలని కోరుతూ భావోద్వేగానికి గురై ఆయన మాట్లాడిన మాటలను అవహేళన చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మీటింగ్ లో ఏనుగు రవీందర్ రెడ్డి కించపరిచేలా మాట్లాడడం ఆయన కుసంస్కారానికి నిదర్శనమన్నారు. మందిది అయితే మంగళవారం మనది అయితే సోమవారం అన్న ధోరణి బిఆర్ఎస్ నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తుందని, లారీల కొరత ఏర్పడి వడ్ల కొనుగోళ్ళ విషయంలో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే స్వయంగా లారీలను వడ్ల కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అనుభవజ్ఞుడు, రైతు పక్షపాతి అని చెప్పుకునే సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి కూడా విమర్శించడం వారి విజ్ఞతకు వదిలేస్తున్నామని, వారే స్వయంగా ఎన్నోసార్లు అవినీతి పరుడని విమర్శించిన మాజీ ఎమ్మెల్యే ని గెలిపిస్తా అంటుంటే చొప్పదండి ప్రజలు నవ్వుకుంటున్న విషయం గమనిస్తే బాగుంటుందన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో మేడిపల్లి సత్యం గారు చేస్తున్న అభివృద్ధికి, ఆయన పడుతున్న కష్టానికి కాంగ్రెస్ పార్టీ అడ్డాగా మారిపోయిందని సుంకె రవిశంకర్ గారిని ఎంత లేపాలని చూసినా అది వృధా ప్రయాసగా మాత్రమే మిగులుతుందని ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి చురకలు అంటించారు.

# 12 కోట్ల విలువైన డ్రగ్స్‌తో పట్టుబడ్డ మోడల్..

- స్టమ్స్ వాళ్లకి కట్టుకథ చెప్పిన హర్ష సన్నీ




**ముంబై ప్రతినిధి జూన్ 12 నేటి తరం**

ముంబయి విమానాశ్రయంలో భారీగాగంజాయి పట్టివేత బ్యాంకాక్ నుంచి ముంబయికి గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డ కేరళ మోడల్ హర్ష సన్నీ అనుమానాస్పదంగా ప్రవర్తించడంతో తనిఖీలు చేపట్టిన కస్టమ్స్ అధికారులు నిందితురాలి బ్యాగులో 11 కేజీల గంజాయి స్వాధీనం పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ రూ. 11.82 కోట్లుగా గుర్తింపు అరెస్టయిన హర్ష సన్నీ 2025 మిసెస్ కేరళ పోటీలో పాల్గొన్నట్లు వెల్లడి నిందితురాలిని జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన అధికారులు, కొనసాగుతున్న విచారణ

# ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను కేంద్రాలను వెంటనే రద్దు చేయాలి.

- విద్యా కేంద్రాలను అంగన్వాడీలకు అప్పజెప్పాలి
- పి. శివరాణి కోశాధికారి మేడ్చల్ జిల్లా తెలింగాణ అంగనవాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూన్22 నేటితరం**

ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్య కేంద్రాలను అంగన్వాడీలకే అప్పచెప్పాలని వాటిని ప్రత్యేకంగా నిర్వహించే పద్ధతిని ప్రభుత్వం మానుకోవాలని తెలంగాణ అంగనవాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పి శివరాణి డిమాండ్ చేశారు. శుక్రవారం అల్వాల్ మండల ఆఫీస్ వద్ద అంగన్వాడీ టీచర్స్ అండ్ యూనియన్ నాయకత్వంలో ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కి వినతి పత్రాలు అందజేశారు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈ కార్యక్రమానికి రేణుక అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా శివరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విద్య విధానంలో భాగంగా అంగన్వాడీల కేంద్రాలకు ఎసురు పెట్టే కార్యక్రమానికి పూనుకొన్నదని విమర్శించారు. అందులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూల్ ను మరియు పిఎం శ్రీ విద్యను ప్రవేశపెడుతున్నారని అన్నారు.అంగన్‌వాడీలకు నష్టం కలిగించే ప్రీ ప్రైమరీ స్కూల్ పి.ఎం.శ్రీ విద్యను గ్రామములో అమలు చేయమని వాటిని అంగన్‌వాడీ లకు అప్పజెప్పాలని కోరుతూ తీర్మాణం చేసి రాష్ట్ర ప్రభుత్వం పంపాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం పాటించడం దారుణమని విమర్శించారు. ప్రీ ప్రైమరీ మరియు పీఎం శ్రీ కేంద్రాలను అంగనవాడలకే అప్పచెప్పుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.30 నుండి 40 సంవత్సరాలగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లకు మరియు హెల్పర్లకు ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలతో వారి ఉద్యోగాల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.అంగన్వాడీలకు ప్రమాదంగా మారిన ప్రీ ప్రైమరీ ,పి.ఎం.శ్రీ 4,131 కేంద్రాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శిల్ప, పుణ్యవతి, వరలక్ష్మీ,తదితరులు పాల్గొన్నారు

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

## పనివాళ్లతో ఫిర్యాదుతో బయటపడ్డ వైనం

హనీట్రాప్ లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు.

# క్యాన్సర్‌పై మనోధైర్యమే గొప్ప ఆయుధం.

**- డాక్టర్ రామకృష్ణ ప్రసాద్**




**నేటి తరం కరీంనగర్ జూన్ 12**
భారతదేశంలోనే మొదటిసారిగా సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో అత్యాధునిక 'హైపర్‌సైట్' టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్స క్యాన్సర్ మహమ్మారిని జయించడానికి వైద్యంతో పాటు రోగికి ఉండే మనోధైర్యమే అత్యంత కీలకమైన ఆయుధమని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి ప్రముఖ ఆంకాలజీ నిపుణుడు డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. కరీంనగర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన వెల్లడించిన ముఖ్య వివరాలు:దేశంలోనే తొలిసారిగా 'హైపర్‌సైట్' టెక్నాలజీ: యశోద ఆసుపత్రి రేడియేషన్ ఆంకాలజీ విభాగంలో అత్యంత ఆధునికమైన 'హైపర్‌సైట్' సాంకేతికతను అందుబాటులోకి తెచ్చారు. ఈ సరికొత్త మిషన్ భారతదేశంలో మరెక్కడా లేదని, కేవలం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. దుష్ప్రభావాలు లేని ఖచ్చితమైన చికిత్స: ఈ టెక్నాలజీ ద్వారా క్యాన్సర్ కణాలు ఉన్న ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించి, కేవలం ఆ భాగాలకు మాత్రమే రేడియేషన్ అందిస్తారు. దీనివల్ల చుట్టుపక్కల ఉండే ఆరోగ్యకరమైన శరీర భాగాలపై దుష్ప్రభావాలు చాలా తక్కువగా ఉంటాయి. ప్రారంభ దశలోనే గుర్తింపు - సంపూర్ణ నివారణ: క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రజల్లో దీనిపై అవగాహన పెంచేందుకు ఆసుపత్రి తరఫున ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవంతమైన చికిత్సలు: ఈ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పటికే అనేక మంది క్యాన్సర్ రోగులకు విజయవంతంగా చికిత్స అందించి, వారిని కోలుకునేలా చేశామని డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ వివరించారు. కరీంనగర్ , పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆధునిక వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి శ్రీకాంత్ , మహేందర్ లు పాల్గొన్నారు.

# న్యూ అర్బన్ కాలనీలో 100 కెవిఏ నూతన డీటీఆర్ ప్రారంభం

- తక్కువ వోల్టేజ్ సమస్యలకు పరిష్కారం..
- వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా
- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్



**నేటి తరం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న తక్కువ వోల్టేజ్ సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్-44/160 కెవిఏ సాయిబాబా టెంపుల్ డీటీఆర్‌పై ఉన్న లోడ్‌ను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన 100 కెవిఏ నూతన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ (డీటీఆర్)ను రాజన్న సిరిసిల్ల విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ టి.వేణుమాధవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన డీటీఆర్ ఏర్పాటు ద్వారా కాలనీలోని వినియోగదారులకు మెరుగైన వోల్టేజ్‌తో నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. దీంతో విద్యుత్ అంతరాయాలు తగ్గి, వినియోగదారుల సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డిఈ వెంకటరమణ, ఏడిఈ గంగాధర్, ఏఈ సిద్ధార్థతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.1.21 లక్షల విరాళం



**నేటి తరం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ఆలయ రిటైర్డ్ ఏఈఓ బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శర్మ, అరుణ దంపతులు రూ.1,21,111 విరాళాన్ని గురువారం ఆలయ ఈవో ఎల్. రమాదేవికి అందజేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు దాతల సహకారం ఎంతో అవసరమని ఈవో పేర్కొంటూ రిటైర్డ్ ఏఈఓ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకౌంటింగ్ విభాగం అడ్వైజర్ ఆగమరావు ఉన్నారు.

# మృతురాలి కుటుంబానికి అండగా నిలిచిన పోల్సాని వేణురావు

- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి పరామర్శ



**నేటి తరం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 12:**
జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బోయిని ఎల్లమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ పోల్సాని వినోద్--నారాయణరావు కుమారుడు పోల్సాని వేణురావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వేణురావు, వారి కష్టసమయంలో అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధ నుంచి ధైర్యంగా బయటపడాలని సూచిస్తూ, గ్రామ ప్రజల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఈ ఆర్థిక చేయూతకు కృతజ్ఞతలు తెలుపగా, గ్రామంలో సామాజిక బాధ్యతతో ముందుకు వస్తూ అవసరమైన వారికి సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రెబెల్లి వెంకటేష్, వార్డు సభ్యులు మాట్ల సురేష్, పుల్లూరి రాజేశ్వరి--రాములు, బండారి ప్రశాంత్, కుటుంబ సభ్యులు బోయిని అంకుష్, బోయిని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌ఏలే కాంగ్రెస్ విజయానికి బలమైన పునాది

- కుత్బుల్లాపూర్‌లో బీఎల్‌ఏ అవగాహన, శిక్షణ సదస్సులో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్
- ప్రతి బూత్‌లో సమర్థవంతంగా పనిచేయాలి
- ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్‌ఏల భాగస్వామ్యం తప్పనిసరి
- నకిలీ ఓటర్ల తొలగింపులో అధికారులతో సమన్వయం అవసరం
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యం






**కుత్బుల్లాపూర్, జూన్ 12 ( నేటితరం) :**
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఎన్నికల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్‌ఏలు) పాత్ర అత్యంత కీలకమని మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన బీఎల్‌ఏ అవగాహన, శిక్షణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఏ శిక్షణ కార్యక్రమ ఇన్‌చార్జి ఎం.ఏ. ఫహీమ్తో కలిసి పాల్గొన్న కూన శ్రీశైలం గౌడ్, పార్టీ నిర్మాణంలో బూత్ స్థాయి కార్యకర్తలే కీలక శక్తిగా నిలుస్తారని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ పట్ల నిబద్ధతతో, సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి బీఎల్‌ఏ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. ఓటరు జాబితాల పరిశీలనలో భాగంగా నకిలీ ఓటర్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు), ఎన్నికల అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షుడు ముఖేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ సదస్సులో కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి హనుమంత్ రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ మిథున్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూపతి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వివిధ డివిజన్లకు చెందిన పార్టీ శ్రేణులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఓటర్ల జాబితా సవరణలో కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలి





- కొంపల్లిలో బూత్ స్థాయి ప్రతినిధు లకు అవగాహన, శిక్షణ శిబిరం
- బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు
- ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచన
- పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

**కుత్బుల్లాపూర్, జూన్ 12 ( నేటితరం):**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో బూత్ స్థాయి ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లిలోని ఎస్ఎన్ఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బూత్ స్థాయి ప్రతినిధులకు అవగాహన, శిక్షణ శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకుడు, తెలంగాణ ఆహార సంస్థ చైర్మన్ ఫహీం, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మైపాల్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సామాజిక మాధ్యమాల సమన్వయకర్త ఏపీ మిథున్ రెడ్డి పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలంటే ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదు కావడంతో పాటు, తప్పుల సవరణ, మార్పులు, చేర్పుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకొని పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా పార్టీకి బలమైన ఓటరు ఆధారాన్ని ఏర్పరచుకోవచ్చని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్ ఉపాధ్యక్షుడు బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ నాయకులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 20" సం"రాల మంచినీటి కలను సాకారం చేసిన మాదాపూర్ గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు..



- హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు సర్పంచ్ పాలకవర్గానికి కృతజ్ఞతలు..




**మాదాపూర్ తుర్కపల్లి మండలం జూన్ 12 నేటి తరం**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గత 20 సంవత్సరాలుగా మంచినీటి సమస్యతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు.. గ్రామ ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని కృతనిచ్చేయంతో మాదాపూర్ గ్రామ సర్పంచ్ సీత రాజు యాదవ్ ఉపసర్పంచ్ మంగ్యా నాయక్ గ్రామ వార్డు సభ్యుల బృందమంతా సమస్య పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా కృషిచేసి. నేడు గ్రామంలో 24 గంటలు మంచినీటి వసతి కల్పించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులందరికీ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీత రాజు యాదవ్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మాదాపూర్ లో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని దాన్ని శాశ్వత పరిష్కారం చేయాలనుకుంటున్నజయంతో చెరువు నుండి మాదాపూర్ గ్రామం వరకు నూతన పైప్ లైన్ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు 24 గంటలు వాటర్ వచ్చే విధంగా కృషి చేశామని సర్పంచ్ తెలిపారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతరాజు యాదవ్ ఉపసర్పంచ్ మంగ్యా నాయక్ తో పాటు గ్రామ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి కారోబార్ తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది
- రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు.

# జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి ఆర్పీఐ (ఏ) పోటీ

- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు



**నేటి తరం హైదరాబాద్,జూన్ 12**
వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి ఎన్డీఏ భాగస్వామ్య పార్టీ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఏ) పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే పార్టీ అధినేత, జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే బీజేపీ జాతీయ నేతలతో చర్చలు జరిపారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తో ఆర్పీఐ (ఏ) పార్టీ ప్రతినిధులు చర్చించారని ఆయన తెలిపారు. ఈసారి బీజేపీతో కలిసి గ్రేటర్ లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధితో పాటు తెలంగాణ రాష్ట్రం, గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి డబుల్ ఇంజిన్ నరేంద్ర మోదీ సర్కార్ ద్వారానే సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బీజేపీ, ఆర్పీఐ(ఏ) పార్టీల శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా పనిచేసి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో అత్యధిక రోజులు పనిచేసిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించిన ప్రధాని నరేంద్రమోదీకి గ్రేటర్ ఎన్నికల్లో విజయం సాధించి బహుమతిగా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. అత్యంత ప్రజాదరణ పొందిన ప్రపంచం మెచ్చిన నాయకుడు మనకు ప్రధానిగా ఉండటం దేశ ప్రజలకు గర్వంగా ఉందని అన్నారు. దేశ రక్షణ, ఆర్థిక అభివృద్ధి, సామాజిక సంక్షేమ రంగాల్లో ప్రధాని చూపిన చొరవ అద్వితీయమని అన్నారు. మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మోదీకి భగవంతుడు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలను, దేశాన్ని మరింత ముందుకు నడిపించే శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

# వర్ధన్నపేట బిఎల్ఎ బూత్ స్థాయి సమావేశంలో పాల్గొన్న హనుమకొండ కిషన్ సెల్ అధ్యక్షులు వెంకట్రాం నరసింహారెడ్డి



**నేటి తరం బ్యూరో, జూన్ 12**
హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించిన బీఎల్ఏ స్థాయి సమావేశం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, బూత్ కమిటీల పనితీరును సమీక్షించడం, రానున్న రాజకీయ కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ కడియం కావ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుబ్బిళ్ల శ్రీనుబాబు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, పార్లమెంట్ ఇన్‌చార్జులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, ఎనుమాముల మార్కెట్ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక-అనిల్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పార్టీ విజయానికి బూత్ కమిటీలు వెన్నెముకలాంటివని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని జిల్లా, మండల, డివిజన్, గ్రామ స్థాయి నాయకులు, సర్పంచులు, బూత్ ఏజెంట్లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం ఎన్నికలపై కోర్టులో కీలక పిటిషన్

- పాక నవీన్ బాబు



**నేటి తరం హైదరాబాద్, జూన్ 12**
తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘం లో ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర మరియు జిల్లా స్థాయి ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ న్యాయవాది పాక నవీన్ బాబు సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ లో ౹ూ 31/2026 పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ ఓంకారం సంతోష్ రాజు తరఫున ఈ పిటిషన్ వేయగా, విచారణ జరగనుంది.సంఘంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ పిటిషన్‌లో కీలక విషయాలను తెలిపారు. సంఘ నియమావళికి బైల ప్రకారం విరుద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తున్నారని,అంతేకాకుండా, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటులో ఇతర జిల్లాలకు చెందిన వ్యక్తులను సభ్యులుగా చేర్చుకుని, వారినే అధ్యక్షులుగా ఎన్నుకోవడం ద్వారా భారీ అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. భట్రాజు సంఘం నిబంధనల ప్రకారం జిల్లాకే చెందిన సభ్యులు మాత్రమే ఆ జిల్లా అధ్యక్ష పదవికి పోటీ చేయాల్సి ఉండగా, ఇతర జిల్లా వారిని ఎన్నుకోవడం హోదా హక్కుల ఉల్లంఘన అని న్యాయవాది పాక నవీన్ బాబు తెలిపారు.ఈ నేపథ్యంలో, అక్రమాలకు తావు లేకుండా ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను వెంటనే ఆపాలని సమగ్ర విచారణ జరపాలని కోర్టును కోరారు.

# ఓటర్ల హక్కుల పరిరక్షణే కాంగ్రెస్ కార్యకర్తల ప్రధాన బాధ్యత

» ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలి
» ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు





**నేటి తరం బ్యూరో,జూన్ 12**
ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, ఆ హక్కు పరిరక్షణ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మార్గనిర్దేశనం చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి అయూబ్, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రియాంక పులి అనిల్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇన్‌చార్జులు, ప్రజా ప్రతినిధులు, బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో భాగంగా ఎంపీ కడియం కావ్య స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా నిర్వహణ, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, తొలగింపులు, అభ్యంతరాల పరిష్కారం, బూత్ స్థాయి కార్యకలాపాలపై సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, దానిని హరించే ఏ ప్రయత్నాన్నైనా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా బూత్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. దొంగ ఓట్ల చేర్పు, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపు వంటి అంశాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.
కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జూన్ 25 నుంచి ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) మూడో దశ కార్యక్రమాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు అత్యంత బాధ్యతతో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించాలని, ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి సమస్యలను తెలుసుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని నాగరాజు అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఏడాది పొడవునా బూత్ స్థాయిలో చురుకుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ఓటు చోరీ" అవగాహన కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా భారీ స్థాయిలో సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి బూత్‌ను కాంగ్రెస్ పార్టీకి బలమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం బూత్ ఏజెంట్లు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, ఓటర్ల హక్కుల సంరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఓటు హక్కు పరిరక్షణలో ప్రతి కార్యకర్త యోధుడిగా నిలవాలి

- బీజేపీ ఓటర్ల జాబితాలపై ప్రమాదకర రాజకీయాలు చేస్తోంది
- బూత్ స్థాయి నుంచే ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రారంభం కావాలి
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే సహించం
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య





**నేటి తరం బ్యూరో, జూన్ 12**
ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ బాధ్యత అని, ఆ బాధ్యతను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుండాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ బూత్ స్థాయి ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజుతో కలిసి పాల్గొన్న డాక్టర్ కడియం కావ్య, ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా ఎంపీ డా. కావ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందలేమని గ్రహించిన బీజేపీ ఓటర్ల జాబితాల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు కుట్రలకు పాల్పడుతోందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోవాలని, ప్రతి బూత్ స్థాయి ప్రతినిధి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "ఇప్పటి వరకు ఓటు వేశాం కదా" అనే నిర్లక్ష్యం వద్దని, ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ నిర్ధారించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు కోల్పోవడం అంటే ప్రజాస్వామ్య హక్కును కోల్పోవడమేనని ఆమె పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును కాపాడటం ప్రతి రాజకీయ కార్యకర్త బాధ్యత అని పేర్కొన్న ఆమె, రాబోయే మూడు నెలల పాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలను పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పుల సవరణ, అన్యాయంగా తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి మెట్టు అని, బూత్ బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని పేర్కొంటూ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ విజయానికి ప్రతి కార్యకర్త అహర్నిశలు శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ కడియం కావ్య రూపొందించిన "బూత్ స్థాయి ప్రతినిధుల సంక్షిప్త సమాచారం పుస్తకం"ను ఆవిష్కరించి బూత్ స్థాయి ప్రతినిధులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శంకర్ నాయక్, టీపీసీసీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గురుకులాల కాంట్రాక్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల సంయుక్త చర్యా సమితి రాష్ట్ర చైర్మన్ మంద శ్యామ్



**నేటి తరం బ్యూరో, జూన్ 12**
గురుకుల విద్యాసంస్థల్లో కాంట్రాక్టుల కేటాయింపులు, కేంద్రీకృత విధానంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల సంయుక్త చర్యా సమితి రాష్ట్ర చైర్మన్ మంద శ్యామ్ డిమాండ్ చేశారు.
శుక్రవారం హనుమకొండ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంద శ్యామ్ మాట్లాడారు. మాజీ మంత్రి హరీష్ రావు గురుకులాల్లో రూ.2,000 కోట్ల అవకతవకలు జరిగాయని చేసిన వ్యాఖ్యలను ఖండించిన సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పందనపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీష్ రావు చేసిన ఆరోపణలు కేవలం ఒక గురుకుల సంస్థకు సంబంధించినవి కాకుండా బీసీ, గిరిజన, మైనార్టీ, కస్తూర్బా పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలలతో సహా వివిధ విద్యా సంస్థలకు సంబంధించినవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గురుకులాల్లో కాంట్రాక్టులను కేంద్రీకృతం చేయడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని, జీవో నంబర్ 17 అమలు అవసరంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే జీవో 17పై హైకోర్టు ఇచ్చిన తీర్పు అంశంపైనా ప్రభుత్వం వివరణ ఇవ్వాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు విదేశీ విద్య, ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాసంస్థల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశాలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం కూడా ముందుకు రావాలని మంద శ్యామ్ సవాల్ విసిరారు. చేవెళ్ల-కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో వాటా కల్పించే విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ బొల్లే మధుకర్, నాయకురాలు పుష్పితలయ, రాష్ట్ర సహ కన్వీనర్ శనిగరం శ్రీనివాస్, రాష్ట్ర న్యాయ సలహాదారు మారపెల్లి మనోజ్, ఒంటేరు చక్రి, బొల్లారం రమాకాంత్, తేళ్లూరి సురేష్, అల్లూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు పని కల్పించేలా టెండర్ విధానాన్ని రద్దు చేయాలి







**నేటి తరం బ్యూరో, హైదరాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండిస్తున్న ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తున్న విధంగానే, చేనేత కార్మికులు నేస్తున్న అన్ని వస్త్రాలను కూడా టెస్కో ద్వారా కొనుగోలు చేసి చేనేత రంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తం మురళి డిమాండ్ చేశారు.
హైదరాబాద్‌లో తెలంగాణ చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కమర్తం మురళి నాయకత్వంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన చేనేత కార్మికులు, జిల్లా అధ్యక్షులు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉపాధి లేక ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి కల్పించేలా ప్రత్యేక జీవో విడుదల చేయాలని కోరారు.చేనేత కార్మికులు నేసే వస్త్రాలను టెస్కో ద్వారా నేరుగా కొనుగోలు చేయడం వల్ల వారికి చేతినిండా పని లభించడంతో పాటు ఆర్థిక భద్రత కూడా కలుగుతుందని ప్రతినిధులు మంత్రికి వివరించారు.వారి వినతిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, సెక్రటరీ జనరల్ గడ్డం జగన్నాథం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు, యువజన విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొప్పెర వెంకట హరిహర కిషన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, టీపీపీఎస్ ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, గుర్రం శ్రవణ్, వైద్యం రాజగోపాల్, ఆడెపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

– ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# జైలర్-2లో గెస్ట్ పాత్రలో హృతిక్ ?

సూపర్‌స్టార్ రజినీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'జైలర్ 2'. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ సినిమాలో మొదట బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ అతిథి పాత్రలో కనిపించబోతున్నాడని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఈ సినిమాలో ఒక పవర్‌ఫుల్ అండ్ ఇంటెన్స్ కామియో రోల్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో రజినీకాంత్, హృతిక్ రోషన్ కలిసి నటించిన 'భగవాన్ దాదా' (1986) చిత్రం తర్వాత, దాదాపు 40 సంవత్సరాల అనంతరం వీరిద్దరూ కలిసి మళ్లీ ఒకే స్క్రీన్‌పై కనిపించబోతున్నారు. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కి సంబంధించిన కొన్ని కీలకమైన సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా వేసిన సెట్స్‌లో భారీ ఎత్తున చిత్రీకరించనున్నట్లు ఇండస్ట్రీ టాక్. ఈ మైండ్ బ్లోయింగ్ క్రేజీ అప్‌డేట్ ఇటు సౌత్ ఇండస్ట్రీతో పాటు అటు నార్త్ ప్రేక్షకుల్లోనూ సినిమాపై



ఉన్న అంచనాలను ఒక్కసారిగా స్కై హైకి తీసుకెళ్లింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, ఎస్.జె.సూర్య, మలయాళ సూపర్ స్టార్



మోహన్‌లాల్, సీనియర్ నటి రమ్యకృష్ణ, మిర్నా మీనన్, హాస్య నటుడు యోగి బాబు వంటి భారీ తారాగణం నటిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తుండగా, ఈ ఏడాది చివర్లోనే ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



## పూరీ మార్క్...
## స్లమ్ డాగ్ టీజర్

డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'స్లమ్‌డాగ్ -33 టెంపుల్ రోడ్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేసింది. ఇటీవలే విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ రాగా, తాజాగా చిత్రయూనిట్ ఈ టీజర్ వెనుక ఉన్న కష్టాన్ని, షూటింగ్ ఆసక్తికర విశేషాలను చూపిస్తూ ఒక పవర్‌ఫుల్ 'టీజర్ మేకింగ్ వీడియో'ను విడుదల చేసింది. ఈ మేకింగ్ వీడియోలో దర్శకుడు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ స్టైల్‌లో సీన్లను ఎంత అద్భుతంగా డిజైన్ చేశారో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయ్ సేతుపతి ఒక యాచకుడి పాత్రలో విలక్షణమైన గెటప్, విభిన్నమైన డైలాగ్ డెలివరీ, మరియు యాక్షన్ సీక్వెన్స్ కోసం పడిన శ్రమ ఈ వీడియోలో ప్రధాన హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం సమాజంలో మనం చూసే యాచకుల వెనుక ఉండే కొన్ని నిజమైన సంఘటనలు మరియు బలమైన ఎమోషన్స్ ఆధారంగా తెరకెక్కుతోందని పూరి జగన్నాథ్ వివరించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటి టబు ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుండగా, హీరోయిన్‌గా సంయుక్త.. కన్నడ నటుడు దునియా విజయ్ విలన్ రోల్‌లో కనిపించ బోతున్నారు.

## మాటే పాటయితే..సింగీతం తరహా మూవీ
## సింగ్ గీతంతో కొత్తగా ఆలోచించిన దర్శకుడు

94ఏండ్ల వయసులో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహించిన ఫాంటసీ కామెడీ మ్యూజికల్ ఫిల్మ్ 'సింగ్ గీతం'. మాటల్లేకుండా 'పుష్పక విమానం' వంటి గొప్ప క్లాసిక్‌ని తెరకెక్కించిన సింగీతం.. 'మాటలే పాటలైతే' అని కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందించారని తెలియగానే, ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి మొదలైంది. పైగా ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మించడం, సింగీతం విజన్‌కి నాగ్ అశ్విన్ మేకింగ్ తోడవ్వడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. కథలోకి వెళితే..ప్పుడే జైలు నుంచి విడుదలైన ప్రతాప్(ఆయాన్) తన తండ్రి తన పేరు రాసిన ఆస్తిని దక్కించుకునేందుకు అగ్రిమెంట్ పేపర్లను తీసుకొని కుబేరపురం గ్రామానికి వెళ్తాడు. అదో మిస్టీరియస్ విలేజ్. అక్కడ ఓ కొండ ఉంటుంది. ఆ కొండలో కుబేరుడి గుహ కూడా ఉంటుంది. ఆ ప్రాంత జనం కుబేరుడ్ని పూజిస్తుంటారు. ఎడారిని తలపించేలా ఉన్న ఆ ఊరిలో ఒకేఒక భారీ వృక్షం ఉంటుంది. ఆ చెట్టంటే ప్రాణం ఇచ్చే గౌరీ(అహల్య)ని కలుసుకుంటాడు ప్రతాప్. ఆమె ద్వారా సెల్ఫిష్ మైనింగ్ బిజినెస్ విమెన్ రేణు(షాలిని)ని కలుస్తాడు. ఆ ప్రాంతమంతా బంగారు గని అని రేణు మాటల ద్వారా తనకు అర్థమవుతుంది. రేణు, ఆమె తండ్రి(బెనర్జీ) ఇద్దరూ కలిసి తన పేరున్న స్థలంలో కూడా మైనింగ్ జరిపి, అక్కడున్న బంగారాన్ని కూడా దోచుకోవాలని చూస్తున్నారనే విషయం ప్రతాప్‌కి తెలుస్తుంది. ఉన్నట్టుండి భాగస్తుడైన ప్రతాప్ రావడంతో, చేసేది లేక రేణు, రేణు తండ్రి తమ వ్యాపారంలో ప్రతాప్‌ని కూడా భాగస్తుడిగా చేర్చుకుంటారు. అప్పటికే ఆ ప్రాంతం అంతా మైనింగ్ జరిపేసి ఉంటుంది. ఒక్క వృక్షం ఉన్న ప్లేస్‌లో మాత్రం మైనింగ్ జరిగి ఉండదు. దాంతో అక్కడ మైనింగ్ చేద్దామని ప్రతాప్ సూచించడంతో, అహల్య వద్దని వారిస్తున్నా, ఆ భారీ వృక్షాన్ని కూలగొడతారు. దీంతో గౌరీ తీవ్ర మనస్తానికి గురవుతుంది. ఆ బాధలోనే అనుకోకుండా కుబేర గుహలోకి వెళ్తుంది. ఊహించని విధంగా ఆ ఊరి జనమందరికీ మాట కాస్తా పాటై కూర్చుంటుంది. అందరూ నిజాలు చెప్పేస్తుంటారు. మాటను పాటలా పాడుతూ అంతా విచిత్రంగా,



విడ్డూరంగా ఫీలవుతుంటారు? ఆ జనానికి మళ్లీ మాట ఎలా వచ్చింది? కుబేరుడి శాపం వల్ల ఆ ప్రాంతంలో ఎలాంటి పరిణామాలు తలెత్తాయి? అనేది మిగతా కథ. సింగీతం శ్రీనివాసరావు అంటేనే ఓ ప్రయోగశాల. మాటే పాటైతే అంటూ మరో కొత్త ప్రయోగానికి తెర లేపుతూ చేసిన ప్రయత్నమే ఈ సినిమా. ఇది అన్ని సినిమాల్లాంటి సినిమా కాదు. నాగ్ అశ్విన్ చెప్పినట్టు ఇలాంటి సినిమాను ప్రపంచం నిజంగానే చూడలేదు. అది నిజంగా వందశాతం నిజం. అసలు ఇలాంటి ఆలోచన రావడమే నిజంగా గొప్ప విషయం. ఈ విభిన్నమైన కథ ద్వారా చాలా గొప్ప విషయాలను స్పృశించారు సింగీతం. పచ్చని చెట్టు బంగారం కంటే మిన్న అనే సందేశం ఈ సినిమాతో ఆయనిచ్చారు. పర్యావరణం గొప్ప తనాన్ని తెలిపేలా ఈ సినిమా తీశారు. సింగీతం విజన్‌ని, తెరపైకి తెచ్చేందుకు నాగ్ అశ్విన్ పడిన కష్టం అణువణువునా కనిపించింది. ఈ ప్రయోగం జనానికి ఎక్కితే, ఇది కచ్చితంగా మరో గొప్ప ప్రయత్నం అవుతుందని చెప్పక తప్పదు. . ప్రయోగాత్మక చిత్రాలు ఇష్టపడే వాళ్లకు 'సింగ్ గీతం' కచ్చితంగా కొత్త అనుభూతిని ఇస్తుంది.

## కిరణ్ అబ్బవరం కెఎ 13
### సొంత బ్యానర్‌పై దర్శకత్వ బాధ్యతలు




యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో సరికొత్త అడుగు వేస్తూ, సరికొత్త ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న 13వ చిత్రానికి 'కెఎ13' అనే వర్కింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాకు సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి అధికారికంగా ప్రారంభం కాబోతున్నట్లు చిత్ర బృందం ఒక ఆసక్తికరమైన పోస్టర్ ద్వారా ప్రకటించింది. అయితే ఈ చిత్రానికి ఒక ప్రత్యేకత ఉంది. కిరణ్ అబ్బవరం కేవలం హీరోగానే కాకుండా, ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా స్వయంగా ఆయనే చేపట్టడం విశేషం. దర్శకుడిగా ఆయనకు ఇది సరికొత్త ప్రయాణం కానుంది. జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక లాడ్జ్ లేదా హోటల్ రిసెప్షన్ డెస్క్‌పై ఉండే బెల్‌ను నొక్కుతున్నట్లుగా ఉన్న ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, కిరణ్ అబ్బవరం ఈసారి ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సస్పెన్స్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.

## నానీ మూవీలో రుక్మిణీ వసంత్

సప్త సాగరాలు దాటి', 'కాంతార 2' లాంటి విజయవంతమైన చిత్రాలతో దక్షిణాదిలోనే కాక ఉత్తరాదిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె చేతుల్లో యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' లాంటి భారీ చిత్రాలున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడామె తెలుగులో మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాని సొంత నిర్మాణ సంస్థ వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై నిర్మించనున్న ఓ కొత్త చిత్రం కోసం ఆమెను నాయికగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీన్ని 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ తెరకెక్కించనున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని.. ప్రధాన నటుడు ఖరారు కాగానే ఈ సినిమాని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉదని సమాచారం.



## టబు సినిమా సీక్వెల్‌తో కత్రినా కమ్‌బ్యాక్!

నాజూకు అందాలతో కుర్రకారును కిర్రెక్కించిన ముద్దుగుమ్మ కత్రినా కైఫ్ తెరపై కనిపించి ఏడాదిన్నర అవుతోంది. చివరిసారిగా ఆమె 2024 డిసెంబరులో విడుదలైన 'మేరీ క్రిస్మస్'తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసింది. నటుడు విక్కీ కౌశల్‌ను వివాహం చేసుకున్న కత్రినా.. గతేడాది సెప్టెంబరులో తల్లిని కాబోతున్నట్లు ప్రకటించి అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పింది. మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు కొన్నాళ్ల పాటు నటనకు విరామం ఇస్తున్నట్లు వెల్లడించింది. అప్పటినుంచి ఆమె కొత్త సినిమాకు సంబంధించిన కబుర్లేవీ వినిపించలేదు. అయితేనేం.. సినిమాలకు బ్రేక్ ఇచ్చినా, ఆమె క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. 'స్టార్స్ ఇండియా లవ్' పేరిట ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో 2025కిగానూ టాప్ 5లో చోటుదక్కించుకొని.. అలియా భట్, దీపికా పదుకొణె, శ్రద్ధాకపూర్, కృతిసనన్‌ల సరసన నిలిచింది. మరోవైపు, కత్రినా కమ్‌బ్యాక్ ఎప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు కిక్ ఇచ్చే వార్త ఒకటి బాలీవుడ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే.. 2001లో టబు ప్రధాన పాత్రలో నటించిన 'చాందినీ బార్' సీక్వెల్‌లో కత్రినా నటించబోతోందట. వాస్తవిక ప్రపంచంలోని వెలుగునీడలను వెండితెరపై ఆవిష్కరిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మధుర్ భండార్కర్ 'చాందినీ బార్'ను తెరకెక్కించారు. ఆ చిత్రం విమర్శకుల ప్రశంసల్ని సైతం అందుకోవడంతో పాటు గత్యంతరం లేని పరిస్థితుల్లో బార్ డ్యాన్సర్‌గా మారిన పాత్రలో టబు నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దానికి సీక్వెల్‌ను తెరకెక్కించబోతున్నట్లు గతేడాది అధికారిక ప్రకటన వచ్చింది. 'సెక్షన్ 375' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అజయ్ బహల్ 'చాందినీ బార్2'కు దర్శకుడిగా వ్యవహరించనున్నారు. అయితే, ప్రధాన పాత్రలో ఎవరు నటించబోతున్నారన్న విషయాన్ని నిర్మాణ సంస్థ ఇంకా ప్రకటించలేదు. ఇప్పుడు ఆ అవకాశం కత్రినాను వరించినట్లు బాలీవుడ్ వర్గాల్లో టాక్. ఇందులో టబు కూడా నటించబోతున్నట్లు తెలుస్తోంది. అదే నిజమైతే కత్రినా అభిమానుల ఎదురుచూపులు ఫలించినట్లే!



TGTEL 26/A4521 Edited..Printed published and owned by BOMMA PRAVALLIKA and printed at RK PRINTERS HNo .1-7-210/2 Kamla Nagar khapra ECL opposite bus stop HYD 62 Medchal malkhajgiri Telangana and publisher at North Kamla towers flat No 402 North Kamla Nagar near registration office Kapra ECIL Hyderabad Medchal malkajgiri 500062 Telangana editor BOMMA AMARENDER RNI title code: TELTEL.09496..Call 8074671575, email pravallika netha22101988@gmail.com